కిరణ్మయి పెళ్లికి వెళ్లివచ్చినప్పటి నుంచీ కైవల్య మనసు మనసులో లేదు.

తానెంతో అభిమానించే తన ప్రియనేస్తం జీవితం... ఇక నరకప్రాయంగా మారనున్నదనే ఆలోచన ఆమెని తీరని ఆవేదనకూ, అశాంతికీ గురిచేస్తోంది.


బి.ఎస్‌సి. ఇద్దరూ కలిసే చదివారు. డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు రాసి అలా వెళ్లిందోలేదో... అంతలో ఏం కొంపలు మునిగాయనో... వాళ్ల నాన్న నెలరోజుల్లోనే ఆ సంబంధం ఖాయం చేసేసి ముహూర్తాలు పెట్టించాడు.

కిరణ్మయి అసలే అమాయకురాలు, తండ్రి చెప్పిన మాటకి ఎదురుచెప్పే ధైర్యం ఆమెకి లేదు. కానీ అన్యాయంగా ఒక దుర్మార్గుని చేతిలో చిక్కిందిప్పుడు. ఇప్పుడా మానవ రూపంలో వున్న మృగం దాని బతుకుతో ఎలాంటి క్రూరమైన ఆటలు ఆడనున్నాడో కదా... అనుకుంటూ కుమిలిపోసాగింది కైవల్య.

పెళ్లి పీటలమీద మందారపువ్వులాంటి కిరణ్మయి పక్కన... కింకరుని వంటి ఆ దినకర్‌ని చూడగానే ఆమెకు మతిపోయినంత పనైంది. కిరణ్మయిని మనసులోనే తిట్టుకుంది. కనీసం ఒక లెటరయినా రాయలేదు తనకు... ఈ పెళ్లీ, పెళ్లికొడుకు గురించి!

ఒక్కక్షణం కైవల్యలో ఆవేశం లావాలా చిమ్ముకువచ్చింది. వెంటనే కిరణ్మయి తండ్రి వద్దకు వెళ్లి ఆ దినకర్ నిజస్వరూపం ఏమిటో చెప్పేసి, ఈ పెళ్లి ఆపుచేద్దామా అన్నంత టెన్షన్ కలిగింది. కానీ అవన్నీ అంత సులభంగా జరిగే విషయాలు కావని, ఇప్పుడు చేయగలిగేదేమీ లేదని గ్రహించి... తనను తాను కంట్రోల్ చేసుకుని కాసేపు అటూఇటూ తిరుగుతూ అక్కడ గడిపి, ఉండబట్టలేక వెనక్కి వచ్చేసింది.

ఓ వైపు కిరణ్మయిపై దిగులు, మరోవైపు



# ఆత్ ది బెస్ట్

దినకర్ మీద కోపంతో... ఆమె మనసు అతలా కుతలం అయిపోతోంది.

దినకర్, కైవల్య బావ శ్రీరామ్ క్లాస్‌మేట్. తరచూ ఇద్దరూ కలిసి కైవల్య ఇంటికి వస్తుండేవారు.

శ్రీరామ్‌కి కైవల్యతో స్నేహమే తప్ప ప్రేమ, పెళ్లి లాంటి ఆలోచనలు లేవు. ఎందుకంటే అతను అప్పటికే మరో అమ్మాయిని ప్రేమిస్తున్నాడు.

ఒకరోజు తన ఎదురింటి నిత్యతో కబుర్లు చెబుతూ వుండగా... వచ్చారు వాళ్లిద్దరూ. నిత్యను పరిచయం చేసుకున్నారు. ఇదంతా చాలా క్యాజువల్‌గా జరిగిపోయింది.

ఆ తరువాత దినకర్ మళ్లీ కనిపించలేదు. సుమారు రెండు నెలల తరువాత కారణమేమిటని అడిగింది కైవల్య శ్రీరామ్‌ని.

కాలేజీకి వస్తూనే వున్నాడనీ, కానీ తనతో ఎక్కువగా తిరగడం లేదనీ అన్నాడు.

"ఎందుకు? మీ ఇద్దరి మధ్య ఏదైనా గొడవ జరిగిందా?" అంది కైవల్య.

"లేదు. కానీ... అతడి ధోరణి నాకేం నచ్చలేదు" అన్నాడు శ్రీరామ్.

"ఏం జరిగింది?"

"నువ్వారోజు పరిచయం చేశావే... ఆ నిత్య... ఆమెని ప్రేమించి మోసం చేశాడని... ఒక పుకారు..."

కైవల్య దిగ్భ్రాంతిగా చూసింది. ఇదంతా తనకస్సలు తెలియదు. నిత్య ఏనాడూ ఈ విషయం చెప్పనేలేదు.

"వివరాలు చెప్పు" ఆవేశంగా అంది.

"నాకేం తెలుసు? నేనడిగితే ఇది తన పర్సనల్ మేటర్ అని, ఏమీ కామెంట్ చేయలేననీ అన్నాడు. ఇంక నిత్యను నీవే అడగాలిమరి" అన్నాడు.

ఆరోజు సాయంత్రం నిత్యని ఇంటికి పిలిపించి, మెల్లగా విషయం కదిపింది కైవల్య.

"నువ్వు దినకర్‌ని ప్రేమించావా? నాకు చెప్పనేలేదే!"

"వాడొక స్టుపిడ్. వాడి సంగతి వొదిలెయ్ కైవల్యా" అది నిరాసక్తంగా.

"అంత తొందరగా మీ మధ్య ప్రేమ ఎలా ఏర్పడిందసలు?!"

"ఏముంది.. ఓసారి ఓషన్ పార్క్‌లో కలిసాడు. ఎక్కువసేపు మాట్లాడుతూ గడపడం జరిగింది. నా జీవితంలో అతి దారుణమైన ఫెయిల్యూర్ ఇది. రాస్కెల్! అసలు వాడి గురించి మాట్లాడకు... ఒళ్లు మండిపోతోంది" అంది నిత్య.

ఆ తరువాత దినకర్ గురించి దాదాపు మరచిపోవడం జరిగింది. కానీ అనుకోకుండా వాడు తన ఫ్రెండ్ కిరణ్మయి మొగుడయి కూర్చున్నాడు.

కైవల్యకంతా కన్‌ఫ్యూజింగ్‌గా వుంది.

ఒక ఫ్రెండ్‌గా పరిచయమయ్యాడు. ఒక

కె. లక్ష్మీ కాంతమ్మ

ఫ్రెండ్‌ని మోసం చేశాడు. ఇంకో ఫ్రెండ్‌కి తాళి కట్టి ఇప్పుడామెని ఏంచేయనున్నాడో! ఈ దినకర్ నుంచి కిరణ్మయిని జాగ్రత్తగా వుండమని హెచ్చరించాలి... అనుకుంది చివరికి.

టేబుల్‌పై పడివున్న కిరణ్మయి వెడ్డింగ్ కార్డ్ చెప్పలేని భయాన్నీ, జుగుప్సనీ పుట్టిస్తోంది.

వెంటనే లేచి, చెప్పులు వేసుకుని తన పర్సు తీసుకుని బయటకు నడిచింది.

వీధి చివరన ఉన్న టెలిఫోన్ బూత్‌లోకి వెళ్లి, కిరణ్మయి ఇంటికి ఫోన్ చేసింది. అప్పటికి పెళ్లి తతంగం అంతా అయిపోయి ఉంటుంది కాబట్టి తనతో మాట్లాడడం పెద్ద కష్టమేం కాదు.

"ఎవరూ?" అంటూ అడిగారెవరో అవతల్నుండి.

"నేను... కిరణ్మయి స్నేహితురాలిని... పేరు కైవల్య. ఒకసారి అర్జంట్‌గా తనని పిలుస్తారా?" అంది.

"లైన్లో ఉండండి."

సుమారు నిమిషం తరువాత...

"హలో కైవల్యా..."

"హలో"

"ఏంటే నువ్వు?... అలా కన్పించి ఇలా మాయమయ్యావ్? నీకోసం పిచ్చిదానిలా వెదికాను తెల్సా?"

"కిరణ్మయీ... నాకు నీగురించి బెంగగా వుందే... నీజీవితాన్ని నాశనం చేసాడు మీ నాన్న అనిపిస్తోంది."

"ఏంటే నువ్వు మాట్లాడేది? నాకేమీ అర్థం కావడంలేదు. వివరంగా చెప్పు" కంగారుగా అంది కిరణ్మయి.

"కనీసం ఒక్కసారైనా నాకు ఫోన్ చేసి... నువ్వు చేసుకోబోయే మనిషిని గురించి నాకు చెప్పి ఉంటే ఈ ఘోరం జరగనిచ్చేదాన్ని కాదే"

"టైమ్ దొరక్క చెప్పడానికి వీలుకాలేదు. కానీ ఇప్పుడంత బాధపడే విషయం ఏం జరిగిందే?"

"బాధపడే సంగతే. కానీ ఎలాంటి బాధో నేను ఊహించలేను. అతను... అతన్ని నచ్చే నువ్వు పెళ్లికి ఒప్పుకున్నావా?"

"అవును... ఎందుకు?"

"అతన్నాకు తెలుసు. అతన్ని నమ్మడానికి వీల్లేదు"

కాస్సేపు నిశ్శబ్దం... అవతలవైపు కిరణ్మయి షాక్‌తిని ఉంటుందని గ్రహించిన కైవల్య...

"హలో... హలో కిరణ్మయీ..." అంది.

"ఆ.. హలో... కైవల్యా...అతని గురించి నీకేంతెలుసు? తొందరగా చెప్పవే. నాకు దడగా ఉంది..." కంగారుగా అడిగింది కిరణ్మయి.

"అతను... నా ఫ్రెండ్ నిత్యని ప్రేమించి మోసం చేశాడు"

"నిత్యా?"


"అవును... మా ఎదురింటమ్మాయి. అతను మా బావతో కలిసి మా ఇంటికి వస్తుండే వాడు. నేనే పరిచయం చేసానా అమ్మాయిని."

"దినకర్ నిత్యని మోసం చేసాడని నిత్యే చెప్పిందా?"

"కాదు... తెలిసింది. నిత్యనడిగితే మాట దాటేసింది."

"అబ్బ... హడలగొట్టావు కదే! ఇంకా ఏమిటో అనుకున్నాను".

"అదేమిటే! ఇక్కడ నీ గురించి నేను దిగులు పడుతుంటేనూ..." అంది కైవల్య అయోమ




యంగా.

“సారీ కైవల్యా... దినకర్ అలాంటివాడు కాదు. నాకంతా చెప్పాడు. దినకర్ తన కోసం పడిచచ్చేలా చేసుకుంటానని నిత్య ఎవరితోనో బెట్ కట్టిందట. పాపం నిత్యకి తెలీదు... ఆల్ రెడీ దినకర్ మరొకరికి ప్రేమలో బుక్కైపోయాడని.

అసలు విషయం తెలిసాక బెట్ ఓడిపోయాననే ఉక్రోషం పట్టలేక దినకర్ గురించి అలా చెడుగా పబ్లిసిటీ ఇస్తున్నదేమో!”

కైవల్య ఆశ్చర్యపోయింది.

“ఇదంతా నీకు దినకర్ చెప్పాడా? ఇదంతా నిజమేనని నువ్వెలా నమ్ముతున్నావ్?” అడిగింది కైవల్య.

“ఎలాగంటే... పిచ్చిదానా.. దినకర్‌ని నిత్యకంటే ముందే నేను ప్రేమించాను. అతనితో పెళ్లి చూపులు జరిగిపోయి చాలా రోజులే అయింది. అయితే మా పెళ్లి విషయం ఎవ్వరికీ తెలీకుండా సడెన్ సర్‌ప్రైజ్‌గా వుండాలనే ఉద్దేశ్యంతో మా ప్రేమ గురించి ఎక్కడా లీక్ కానీయలేదు. ఈవెన్... నీక్కూడా చెప్పలేదు. అందుకే దినకర్ నిత్య ప్రేమ తిరస్కరించాడు గానీ మరో ఉద్దేశ్యంతో కాదు. నిజానికతను అందరితోనూ జోవియల్‌గా వుంటాడే తప్ప ప్రిన్సిపుల్స్ ఉన్న మనిషి. ఎవరో ఏదో తప్పుగా అర్థం చేసుకుంటే తప్పు అతనిది కాదుగా...

అయినా థ్యాంక్యూ కైవల్యా... నా మీదున్న అభిమానం, ప్రేమతో నాగురించి వర్రీ అవుతూ ఫోన్ చేశావు. నీలాంటి ఫ్రెండ్ ఉన్నందుకు నాకెంతో గర్వంగా ఉంది “అంది కిరణ్మయి.

“కానీ నాకు మాత్రం అలా అనిపించడం లేదు. అర్థం లేని క్రేజీతో క్లోజ్ ఫ్రెండ్స్‌క్కూడా ఇలాంటి ముఖ్యమైన విషయాలు చెప్పకుండా ఉండడం పరిపక్వత అనిపించుకోదు. విశ్వాసం ఉన్నప్పుడే స్నేహం విలసిల్లుతుంది. ఆల్‌ది బెస్ట్. బై...” అంటూ ఫోన్ పెట్టేసింది కైవల్య ఉక్రోషంగా.